క్లుప్తంగా

నర్సరీ, క్రీడా ప్రాంగణాల పరిశీలన

భువనగిరి : మండలంలోని ఎర్రంబెల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ జి. నరేందర్‌రెడ్డి నర్సరీలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా ప్రాంగణాల పనులతో పాటు నర్సరీల్లో మొక్కల ఏర్పాటు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. హరిత హారం సమయానికి మొక్కలు సిద్ధంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఆయా గ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రు నాయక్‌కు సన్మానం

భువనగిరి : పట్టణానికి చెందిన పలువురు గిరిజన నాయకులు రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రునాయక్‌ను మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. కలిసిన వారిలో నాయకులు కేతావత్ తిరుపతి, సుధాకర్, లింగం, రవి, రవీందర్, లాలూ, శ్రీనివాస్ ఉన్నారు.

అక్రమ వెంచర్లకు నోటీసులు

మోటకొండూర్ : మండలంలోని గిరిబోయిన గూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఎలాంటి పర్మిషన్లు లేకుండా లే అవుట్ చేస్తున్న వారికి స్థానిక పంచాయతీ కార్యదర్శి స్వాతి మంగళవారం నోటీసులు అందజేశారు. వ్యవసాయ భూమిలో నాటిన హద్దు రాళ్లను తొలగించాలని సూచించారు.

పశుసంపదను కాపాడుకోవాలి

చౌటుప్పల్ : సీజనల్ వ్యాధుల నుంచి పశుసంపదను కాపాడుకోవాలని పంతంగి గ్రామ సర్పంచ్ బాతరాజు సత్యం తెలిపారు. దివీస్ పరిశ్రమ సహకారంతో గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్, దివీస్ ప్రతినిధులు వల్లూరి వెంకటరాజు, జి.వెంకటేశ్వర్లు, ఎస్.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని నాలుగు వార్డుకు చెందిన పెద్దల ముత్యాలుకు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కు, ఓరుగంటి కృష్ణ కుటుంబానికి రూ.48వేల చెక్కులను మంగళవారం స్థానిక కౌన్సిలర్ పెద్దల చక్రపాణి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వార్డు ఇన్‌చార్జ్ తాళ్లపల్లి సతీష్, పెద్దల శంకర్, పోతగల్ల నరహరి తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని వేముల కొండకు చెందిన భద్రం సుదర్శన్ కు మంజూరైన సీఎం సహానిధి రూ.50వేల చెక్కును మంగళవారం స్థానిక టీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోడ బాలయ్య, సాయిని నాగేశ్, బత్తుల శంకరయ్య, ఎండీ దస్తగిరి, ఆకుల వెంకన్న, అంజయ్య, రామలక్ష్మయ్య, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ఆలేరురూరల్ : మండలంలోని గుండ్లగుడెంలో బిడబ్ల్యూ న్యూస్ ఆధ్వర్యంలో సీఎస్ఐ స్కూల్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను బీజేపీ రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అశోక్, బీజేపీ మండల అధ్యక్షుడు దూసరి రాఘవేంద్ర, బడుగు జహంగీర్, మహేశ్, నరేశ్, సముద్రాల కల్పన, క్లైం రాజు, నగేశ్, సతీశ్, పరుశురాం, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఆ మహాసభ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 14న రంగారెడ్డి జిల్లా మన్నెగూడెంలో నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మడలం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, శ్యామ్, రహిమున్నీసా, కవిత, రవికుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలి

అడ్డగూడూరు : క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని గిడ్డంగుల మాజీ చైర్మన్ మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలో ఎస్వీఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం యూత్ క్లబ్‌కు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీఆర్ యూత్ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'బునాదిగాని' పనులు

- మూడు నెలల్లో సాగు నీరందించే విధంగా చర్యలు
- సొంత డబ్బు ఖర్చు చేసి పనులు పూర్తిచేయిస్తున్న ప్రభుత్వ విప్ సునీత
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు


చురుకుగా సాగుతున్న కాల్వ పనులు

ఆత్మకూరు(ఎం) : వృథాగా పోతున్న మూసీ జలాలను వినియోగంలోకి తేవాలన్న లక్ష్యంతో ప్రారంభించిన బునాదిగాని కాల్వ పనులు వారం రోజుల నుంచి ముమ్మరంగా సాగుతున్నాయి. మూడేళ్ల నుంచి కాల్వ పనులు ఆగిపోవడంతో రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కాల్వ పనులు పూర్తి చేసి రైతాంగానికి సాగునీరును అందించడానికి సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి ఎమ్మెల్యే పురుషోత్తం రెడ్డి 2006లో బునాదిగాని కాల్వ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తెలంగాణ ప్రభుత్వం కాల్వ ఆధునీకరణ కోసం రూ.100కోట్లు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో కాల్వ పనులు పూర్తికాలేదు.

60చెరువులు నింపే విధంగా

మూసీ నదికి రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం బండరావిరాల వద్ద అడ్డంగా కత్వ నిర్మాణం చేశారు. దీనినే ముక్తానంతారం కత్వగా పిలుస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం ముక్తాఅనంతారంలోని ఎర్రకుంట నుంచి వలిగొండ మండలం పహిల్వాన్‌పురం, బునాదిగాని చెరువు నుంచి మోత్కూరు మండలం ధర్మారం ఊర చెరువు వరకు సుమారు 98కిలో మీటర్లు ప్రవహించనుంది. గతంలో బీబీ నగర్ మండలం ముక్తా అనంతారం గ్రామం వద్ద మూసీ నదిపై అనంతారం ఆనకట్ట నిర్మాణం చేశారు. ఆనకట్ట ఎడమ గట్టు నుంచి కాల్వను ముక్తా అనంతారంలోని ఎర్రకుంటలో నింపేందుకు తవ్వారు. దీనిని ముక్తా అనంతారం ఫీడర్ ఛానల్ అంటారు.కాల్వ పొడిగింపునే బునాదిగాని కాల్వగా పిలుస్తూ నిర్మాణం చేపట్టారు. ఈ కాల్వ ద్వారా బీబీనగర్, ఘట్కేసర్, వలిగొండ, భువనగిరి, మోటకొండూరు, ఆత్మకూరు(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు ప్రయోజనం కలుగుతుంది. ఆ మండలాల కింద సుమారు 20వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది అధికారుల అంచనాగా ఉంది. సుమారు 60 చెరువులు నిండే అవకాశం ఉంది.

నిరంతరం అధికారుల పర్యవేక్షణలో..

డిసెంబర్ 27న ఆత్మకూరు(ఎం) సర్వేపల్లి వద్ద ఆగిపోయిన పనులను విప్ సునీత ప్రారంభించారు. ప్రస్తుతం మోటకొండూరు మండలం నాంచారిపేట నుంచి సర్వేపల్లి వరకు కాల్వ పనులు పూర్తికావొచ్చాయి. నాంచారిపేట నుంచి ఆత్మకూరు(ఎం) మండల పరిధి పుల్లాయిగూడెం వరకు సుమారు 20 కిలో మీటర్లు ఉంటుంది. విప్ సునీత ఆదేశంతో ఐబీ డీఈ సునీల్ ప్రసాద్, ఏఈ వెంకటరమణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామస్వామిలు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేసి మూడు నెలల్లో సాగు నీరు అందించడానికి అధికారులు కృషి చేస్తున్నారు. కాల్వ పనులను ఇటీవల ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్ రెడ్డి మరో మారు పర్యవేక్షించారు. గతంలో రైతులు అంగీకరించని చోట కాల్వ పనులు ఆగిపోయాయి. ఆ రైతులను ఒప్పించి కాల్వ పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకున్నారు.

సంతోషంగా ఉంది



కాల్వ పనులు ఆగి పోయి మూడేళ్లు అవుతుంది. సొంత డబ్బులతో విప్‌సునీత పూర్తిచేయిస్తుండడం సంతోషకరమైన విషయం. కాల్వ ద్వారా సాగునీరు అందిస్తే పూర్తిగా వరి సాగు చేస్తాం. మా ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం

– పైళ్ల గణేశ్‌రెడ్డి, రైతు, కదిరేణిగూడెం

సాగునీటి కల నెరవేరనుంది



ఆత్మకూరు(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు మండలాల రైతుల సాగు నీటి కల త్వరలో నెరవేరబోతుంది. కాల్వ పనులు పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. ఎట్టకేలకు సాగునీరు అందుతున్నందుకు రైతులు సంతోషంగా ఉంది. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత నిర్ణయాన్ని అందరూ అభినందించాల్సిందే.

– ఉప్పలయ్య యాదవ్

దగ్గరుండి పనులను చేపడుతున్నాం



బునాదిగానికాల్వ పనులను పది రోజుల నుంచి దగ్గరుండి నిర్వహిస్తున్నాం. ఈ నెల లోపు పనులు పూర్తి చేస్తాం. ప్రభుత్వ విప్ సునీత రెండుసార్లు పర్యవేక్షించడమే కాకుండా నిరంతరం కాల్వ పురోగతిని తెలుసుకుంటూ మాకు సలహాలు, సూచనలు చేస్తున్నారు.

– ఎం. సునీల్‌ప్రసాద్. ఐబీ డీఈఈ

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా



రైతులకు సాగు నీరందిస్తానని మాట ఇచ్చాను. ఇచ్చిన మాట ప్రకారం నా సొంత డబ్బులతో అసంపూర్తిగా ఉన్న కాల్వ పనులు పూర్తి చేసి సాగు నీరు అందిస్తాం. ఈ కాల్వ ద్వారా జీరో పాయింట్ నుంచి ధర్మారం ఊరచెరువు వరకు 20వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది.

– గొంగిడి సునీత, ప్రభుత్వ విప్

'కంటి వెలుగు'పై అవగాహన కల్పించాలి


భువనగిరి టౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు

భువనగిరిటౌన్ : ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంపై పట్టణ ప్రజలందరికీ అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు అన్నారు. గురువారం కంటి వెలుగు వంద రోజుల కార్యక్రమంపై కౌన్సిల్ అత్యావసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కౌన్సిలర్లందరూ కంటి వెలుగు కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. వార్డుల్లోని ప్రజలను ప్రోత్సహించి శిబిరాలకు తీసుకురావాలన్నారు. అనంతరం కౌన్సిలర్లు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.నాగిరెడ్డి, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీలో ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో నాలుగు రోజుల పాటు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 1వ వార్డుకు ముక్తాపూర్ గ్రామపంచాయతీ భవనం, 2వ వార్డుకు ముక్తాపూర్ వార్డు కార్యాలయం, 3వ వార్డుకు గ్రామపంచాయతీ కార్యాలయం, 4వ వార్డుకు వినోబాభావే మందిరం, 5వ వార్డుకు బీసీ కాలనీ, 6వవార్డుకు పద్మానగర్ స్త్రీశక్తి భవనం, 7వవార్డుకు చేనేత డై హౌజ్, 8వ వార్డుకు సీతావానిగూడెం స్కూల్‌భవనం, 9వ వార్డుకు కేవీటీ స్పోర్ట్స్ క్లబ్ భవనం, 10వ వార్డుకు వినోభామందిరం, 11,12, 13 వార్డులకు చేనేత డై హౌజ్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు పెద్దల చక్రపాణి, గుండు మధు, సామల మల్లారెడ్డి, దేవరాయ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

ఆత్మకూరు(ఎం) : ఈ నెల 18 నుంచి ఆత్మకూరు(ఎం) మండలంలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బి. యాదగిరి ఒక ప్రకటనలో మంగళవారం కోరారు. కంటి వెలుగు కార్యక్రమ విజయవంతం కోసం ఈ నెల 12న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు పాల్గొంటారని, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పారదర్శకంగా 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక


ఆలేరు రూరల్ : లబ్ధిదారుల పేర్లు చదువుతున్న తహసీల్దార్ రామకృష్ణ

ఆలేరురూరల్ : డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని కొలనుపాకలో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ హాజరై మాట్లాడుతూ గ్రామ సభలో వచ్చిన అభ్యంతరాలను స్వీకరించి లబ్ధిదారుల తదిజాబితా ప్రకటిస్తామన్నారు. 64డబుల్ బెడ్ రూంలకు 153 దరఖాస్తులు వచ్చాయని అందులో 67మంది నిరుపేదలను ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. ఇచ్చిన జాబితాలో ఎవరైనా అనర్హులుగా ఉంటే డ్రా బాక్స్ ఏర్పాటు చేస్తామని, బాక్సులో ఫిర్యాదు చేయవచ్చొన్నారు. ఫిర్యాదుదారుల పేరుత గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనురాధ, ఎంపీపీ గంధమల్ల అశోక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగుల శ్రీనావాస్, అంజయ్య, జంగ స్వామి పాల్గొన్నారు.

తుర్కపల్లి : డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు మండల కేంద్రంలోని జెఎం ఫంక్షన్‌హాల్‌లో రెండో గ్రామ సభ మంగళవారం నిర్వహించారు. మొత్తం 40 ఇళ్లకు 176 దరఖాస్తులు రాగా మొదటి గ్రామ సభలో అర్హత కలిగిని దరఖాస్తులు పరిశీలించి 37మందిని అర్హులుగా ఎంపిక చేశారు. వీటిపై ఏవైనా ఆరోపణలు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరాగా వచ్చిన ఫిర్యాదులపై రెండో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభలో 27మందిని అర్హులుగా గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో మిగతా దరఖాస్తుదారులు ఆందోళనకు దిగారు. మొదటి గ్రామ సభలో 37మందిని గుర్తించి ఇప్పుడు 27మందిని అర్హులుగా గుర్తించడమేమిటని నిరసన తెలిపారు. ఆందోళన కారులతో ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్, పోలీస్ సిబ్బంది మాట్లాడి సముదాయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల స్పెషల్ ఆఫీసర్ జి.శ్యాంసుందర్, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీపీ భూక్య సుశీల రవీందర్ నాయక్, సింగిల్ విండో చైర్మన్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ బోరెడ్డి వనజ హనుమంత్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పడాల వనిత శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శైలజ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీల ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న విపక్ష ఎంపీటీసీలు

రామన్నపేట : 15వ ఆర్థిక సంఘం ప్రత్యేక నిధుల కేటాయింపులో తమపై వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ విపక్ష ఎంపీటీసీలు మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నిరసన తెలిపారు. ఈ సమావేశ ప్రారంభంలో వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీలు బడుగు రమేశ్, ఎండీ రెహాన్, పూస బాలమణి, మదూరి జ్యోతి, ఎర్రోళ్ల లక్ష్మమ్మ, వేమవరపు సుధీర్‌బాబులు పోడియం ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. 15వ ఆర్థిక సంఘం నిధులు తమ గ్రామాలకు ఎందుకు కేటాయించడంలేదని ప్రశ్నించారు. ఎజెండా అంశాలను చర్చించకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో అధికార, విపక్షసభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశంను ఏర్పాటుచేసి చర్చిద్దామని, ఎజెండా ప్రకారం ముందుకు సాగుదామని ఎంపీపీ జ్యోతి పదేపదే విజ్ఞప్తి చేసినా సభ్యులు వినిపించుకోలేదు. హాల్‌లోకి పోలీసు కానిస్టేబుల్ వచ్చి ఫొటోలు తీయడంపై సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గంటసేపు వాదోపవాదాలు కొనసాగాయి. ఈ సమావేశంలో ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ గాదె జలేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి ఎంపీటీసీలు గొరిగె నర్సింహ, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, దోమల సతీష్, గాదె పారిజాత, గోగు పద్మ, ఏనుగు పుష్ప సర్పంచ్‌లు గుత్తా నర్సింహారెడ్డి, అప్పం లక్ష్మీనర్సు, మెట్టు మహేందర్‌రెడ్డి, పిట్ట క్రిష్టారెడ్డి, రేఖ యాదయ్య, ఉప్పు ప్రకాష్, ముత్యాల సుజాత, కాటెపల్లి సిద్ధమ్మ, నీల జయలక్ష్మీ, ధర్నె రాణి, ముత్యాల సుజాత, యాదయ్య, కోళ్ల స్వామి, కడమంచి సంధ్య వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విడతల వారీగా అభివృద్ధి

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వార్డులను విడతల వారీగా అభివృద్ధి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం 8వ వార్డులో మురికి కాల్వ నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడారు. జనరల్ ఫండ్ నిధుల రూ. 4లక్షలతో మురుగు కాల్వ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, కౌన్సిలర్లు పంగరెక్కల స్వామి, భగత్, అధికారులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ ఆంజనేయులు

ఆత్మకూరు(ఎం) మండలంలోనే కొనసాగుతాం

ఆత్మకూరు(ఎం) : కొత్త మండలం కోసం డిమాండ్ చేస్తున్న సుద్దాల మండలంలో కలువడానికి తమ గ్రామాల ప్రజలకు ఇష్టం లేదని, ఆత్మకూరు(ఎం) మండలంలోనే కొనసాగుతామని పల్లెపహాడ్, పారుపల్లి, పోతిరెడ్డిపల్లి, సారగండ్లగూడెం గ్రామాల సర్పంచ్‌లు లగ్గాని రమేష్ గౌడ్, సుబ్బూరు వెంకటేశ్వర్లు, గనగాని మాధవి, కల్వల రాములమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోతిరెడ్డిపల్లి మినహా పల్లెపహాడ్, పారుపల్లి, సారగండ్లగూడెం గ్రామాలు గుండాల మండలం నుంచి ఆత్మకూరు(ఎం) మండలంలో విలీనమై ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుంటే మండల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటాయని తమ గ్రామాలను పేర్కొని కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా వ్యవహరిస్తే ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని వారు హెచ్చరించారు.

సబ్సిడీ బియ్యం పంపిణీని కొనసాగించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి : సబ్సిడీ బియ్యాన్ని కొనసాగించి కేజీ బియ్యం తగ్గింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ కరోనా కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా పదికిలోల చొప్పున ఉచితంగా బియ్యం ఇచ్చి ప్రస్తుతం ఐదు కిలోలకు తగ్గించడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇవ్వడంతో నేటికీ బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, ఎల్లయ్య, సోములు, కిష్టయ్య, వెంకటేష్, కిషన్, అశోక్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

వలిగొండ : పేదలకు అందజేస్తున్న రేషన్ బియ్యంలో కేంద్ర ప్రభుత్వం కోతలు విధించకుండా పంపిణీ చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం తహసీల్దార్ గణేశ్ నాయక్ వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి, కల్కూరి రామచందర్, దొడ్డి బిక్షపతి, కలుకూరి ముత్యాలు, గణేష్,ఏనుగు సాయి రెడ్డి, నరసింహ,పురుషోత్తం, పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి


యాదగిరిగుట్ట : జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

యాదగిరిగుట్ట : ఈనెల 18నుంచి 22వ తేదీ వరకు బెంగళూర్‌లో జరిగే సీఐటీయూ 17వ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కన్వీనర్ సుబ్బూరు సత్యనారాయణ, జిల్లా నాయకుడు బబ్బూరి పోశెట్టి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో, మండలంలోని చిన్నకందుకూర్‌లో ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కంబాల స్వామి, బీరయ్య, వెంకటేష్, నాగేష్, ఎర్ర ఆనంద్, శ్రీను, పర్వతాలు, రవి తదితరులున్నారు.

మోత్కూరు : ఈనెల 18నుంచి 23వతేదీ వరకు బెంగుళూరులో జరిగే సీఐటీయూ 17వ ఆలిండియా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కూరెళ్ల రాములు కోరారు. మంగళవారం మున్సిపల్ కేంద్రంలో సంఘం జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల కన్వీనర్ సామ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ కూరెళ్ల నర్సింహ, నిర్మాణ రంగం పట్టణ గౌరవ అధ్యక్షుడు రాంపాక పాపయ్య, అధ్యక్షులు ఎస్‌కె.శ్రీను, కందుకూరి నర్సింహ, లలిత, శ్రీశైలం, రవి, మచ్చగిరి, మహేష్, రవీందర్, అబ్బాస్, నర్సింహ, పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సీఎంకు లేఖ

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులు రాసి పోస్ట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, జిల్లా నాయకులు నిమ్మల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నిలిగొండ మత్స్యగిరి, నాయకులు బందారపు పవన్, జి.మహేష్, కడమంచి కార్తీక్, కొత్త శ్రవణ్, వీరేశం, శేఖర్, మానస, తేజశ్రీ పాల్గొన్నారు.

కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదు


మండలపరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

రామన్నపేట : రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన విపక్ష ఎంపీటీసీలపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని, ఎంపీటీసీలందరికీ సమానంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపీటీసీలకు మద్దతుగా సీపీఎం కార్యకర్తలు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మంజూరైన ఆర్థిక సంఘం నిధులు రూ.26లక్షలు కేవలం అధికారపార్టీ ఎంపీటీసీలకు మాత్రమే కేటాయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దెబ్బతిన్న బీటీరోడ్లకు మరమ్మతులు చేయాలని, లింక్‌రోడ్లను అభివృద్ధి చేయాలని, ఆస్పత్రిలో డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, నాగటి ఉపేందర్, బడుగు రమేష్, ఎర్రోళ్ల లక్ష్మమ్మ, బోయిని ఆనంద్, కూరెళ్ల నర్సింహాచారి, బల్గూరి అంజయ్య, విజయభాస్కర్, రశీద్, నాగేష్, హన్మంత్, బాలరాజు, మల్లారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, కొమ్ము అంజయ్య, ముకుందం పాల్గొన్నారు.

'హాత్ సే హాత్ జోడో' యాత్రను విజయవంతం చేయాలి


ఆలేరు రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి

ఆలేరురూరల్ : రాష్ట్రంలో జనవరి 26 నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టబోయే 'హాత్ సే హాత్ జోడో' యాత్రలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆలేరు మండంలోని కొల్లూరు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకరయ్య, దశరథ గణేశ్, బిక్షపతి, దీపిక, నాగరాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి : హాత్ సే హాత్ జోడో పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆ పాదయాత్రపై ముఖ్య కార్యకర్త ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు భాస్కర్ నాయక్, ఎంపీటీసీలు శ్రీనివాస్ యాదవ్, మోహన్ బాబు, వనజ హన్మంత్ రెడ్డి, ప్రతిభ రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి చాడ భాస్కర్ రెడ్డి,జిల్లా బీసీ సెల్ కార్యదర్శులు వెంకటేష్, పవన్, మండల బీసీ సెల్ అధ్యక్షులు వెంకటేష్, ఎస్టీ సెల్ అధ్యక్షులు పట్టు, ఎస్సీ సెల్ అధ్యక్షులు రఘు,టౌన్ అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి నిఖిల్ గౌడ్, మండల ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వినోద్ నాయక్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి


వలిగొండ : వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి : ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏనుగువారిగూడెం సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సామ రవీందర్‌రెడ్డి, బత్తుల మాధవి శ్రీశైలంగౌడ్, పగిళ్ల రాంరెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ బస్వలింగేశ్వర పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీతో పాటు ఏనుగువారి గూడెం మీదుగా పట్టణ కేంద్రానికి రోడ్డు సదుపాయం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అంజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, అధ్యక్షుడు గుండు సత్యనారాయణ, ఏలేందర్, నర్సింహాస్వామి, సాంబరాజు, నరేశ్, నరేందర్, వెంకటేశం పాల్గొన్నారు.

వలిగొండ : రెడ్లరేపాక రోడ్డును బీటీగా మార్చాలని కోరుతూ మండలంలోని పహిల్వాన్‌పురంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వనగంటి వెంకటేష్ యాదవ్, బండారి సురేష్, లింగ స్వామి, సాయి, అఖిల్ పాల్గొన్నారు.

33 కేవీ విద్యుత్ వైర్లను తొలగించాలని వినతి


విద్యుత్ డీఈకి వినతి పత్రం అందజేస్తున్న అతహార్

భువనగిరి : పట్టణంలోని నివాసాల మీదగా వెళ్తున్న 33కేవీ విద్యుత్ వైర్లను తొలగించాలని కోరుతూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అతహార్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ డీఈ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అతహార్ మాట్లాడుతూ పట్టణంలోని తాతానగర్, ప్రగతినగర్, విద్యానగర్ ప్రాంతాలలోని నివాసాల మీదగా వెళ్తున్న 33కేవీ విద్యుత్ వైర్ల వల్ల ప్రజలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. గతంలో ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు వినివించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. గతంలో పహీడినగర్‌లో విద్యుత్ వైర్లకు తాకి బాలుడు మృతి చెందాడని పేర్కొన్నారు. ఇప్పటికైనా వెంటనే విద్యుత్ వైర్లను మార్చాలని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు షకీల్, సాయి నివాస్, వాహెద్, రాకేష్, వసీమ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత


మోత్కూరు : చెక్కు అందజేస్తున్న నాయకులు

రామన్నపేట : మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రేపాక రమేష్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ మంగళవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన రేగటి నర్సయ్య ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. దీంతో బుర్ర వెంకటేష్‌గౌడ్ ఆర్థిక సహకారంతో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్ రూ.15వేల చెక్కును మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కనకయ్య, మల్లయ్య, బాలరాజు, సుధాకర్, మొగులగాని వెంకటేష్, రాజేష్, స్వామి పాల్గొన్నారు.